## క్లుప్తంగా

### సైబర్ నేరాలపై అప్రమత్తం



కూలీలకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ మహిళలు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని షీ టీమ్ బృందం సూచించింది. మడద గ్రామంలో గురువారం ఉపాధిహామీ కూలీలకు అగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మహిళల చట్టాలు, సైబర్ నేరాల గురించి వివరించారు. సెల్‌ఫోన్ వాట్సాప్‌కు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయవద్దని, అపరిచితులకు ఓటీపీలు, ఇతర వివరాలను చెప్పవద్దని సూచించారు. సమస్యలు ఎదుర్కొనే మహిళలు భయపడకుండా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎలాంటి సమస్యలైనా పరిష్కరిస్తామని, రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మణెమ్మ, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

### ఎక్సైజ్ సీఐగా నర్సింహులు



సీఐని సత్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల ఎక్సైజ్ సీఐగా పి.నర్సింహులు గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ మురళీకృష్ణ గత ఆగస్టులో సెలవుపై వెళ్లారు. దీంతో ఎక్సైజ్ సీఐగా పి.నర్సింహులును నియమిస్తూ ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేయగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. పట్టణ గౌడ సంఘం నాయకులు ఆయనను కలసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సిద్దిరాములుగౌడ్, అయిలయ్యగౌడ్, యాదగిరి, సత్యనారాయణ, సుదర్శన్, వెంకటయ్య, శివయ్య పాల్గొన్నారు.

### తహసీల్దార్‌పై చర్యలేవీ?




ఆందోళన చేస్తున్న మల్లేశం కుటుంబ సభ్యులు

బెజ్జంకి(సిద్దిపేట): హైకోర్టు, ఎస్సీ కమిషన్ల ఆదేశాలను ఉల్లంఘించిన తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి రూపేశ్ డిమాండ్ చేశారు. బేగంపేటకు చెందిన బాధితులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధితుడు మల్లేశం మాట్లాడుతూ బేగంపేటలోని 874 సర్వే నంబరులోని తమ భూమి మరొకరి పేరుమీద నమోదైందని, దానిని సవరించాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. దీంతో హైకోర్టుతో పాటు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. వెంటనే విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. డీటీ గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు.

### కేబీఆర్ ఫౌండేషన్ వితరణ



విరాళం అందజేస్తున్న బాల్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): మండలంలోని వాగునూతి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హన్‌మాన్, రామాలయాల నిర్మాణానికి క్షీరసాగర్ కేబీఆర్ ఫౌండేషన్ రూ.5 లక్షలు అందజేసింది. ఫౌండేషన్ చైర్మన్ కొన్యాల బాల్‌రెడ్డి ఆ నగదును గురువారం గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అలాగే మండలంలోని కమలాబాద్ హన్‌మాన్ ఆలయ నూతన నిర్మాణానికి ఆయన రూ.40 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మమత, నాయకులు బాబు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

### హెల్మెట్ తప్పనిసరి

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని సలాకాపూర్ స్టేజి వద్ద ప్రమాదానికి గురైన ప్రయాణికులను ఎస్‌ఐ షేక్ మహబూబ్ అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వంగపల్లికి చెందిన బోడికే భూమయ్య తన భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో కింద పడ్డారు. దీంతో గాయపడిన వాళ్లను అటుగా వెళ్తున్న ఆయన వెంటనే 108 వాహనాన్ని రప్పించి ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

# ఎనిమిదేళ్లుగా ఎక్కడెక్కడో..!

బెజ్జంకి మండలానికి మంజూరైన ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల ఎనిమిదేళ్లయినా కానరాకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. పేరు మండలానిదైనా దాని నిర్వహణ మాత్రం ఇతర మండలంలో కొనసాగుతోంది. అది కూడా ఎనిమిదేళ్లలో వివిధ మండలాల్లో నిర్వహించారు. దీంతో బెజ్జంకి మండల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

**మంజూరు ఇక్కడ.. నిర్వహణ అక్కడ**
- ఇదీ.. ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల దుస్థితి
- బెజ్జంకిలో శంకుస్థాపన
- ఇతర మండలాల్లో కొనసాగింపు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల కోసం తోటపల్లిలో సేకరించిన స్థలం

బెజ్జంకి(సిద్దిపేట): మండలం పరిధిలోని తోటపల్లిలో ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల నిర్మించేందుకు 2016లో సన్నాహాలు చేశారు. కాని సరైన వసతులు లేవనే సాకుతో ఎనిమిదేళ్లుగా ఇతర మండలాల్లో నిర్వహిస్తూ వస్తున్నారు. దీంతో బెజ్జంకి మండలం కేరాఫ్ అడ్రస్‌గా మాత్రమే మిగిలింది. అప్పటి రాష్ట్ర ఆర్థిక మంత్రి, ప్రస్తుత సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తోటపల్లి శివారులో పాఠశాల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. రూ.13 కోట్లతో మంజూరైన ఈ పాఠశాల భవన నిర్మాణానికి ఐదెకరాల స్థలాన్ని కేటాయిస్తూ అప్పటి కలెక్టర్ కూడా ఆదేశాలు జారీ చేశారు.

**నిర్వహణ ఇలా..**

ఈ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల సన్నాహాల అనంతరం పూర్వ కరీంనగర్ జిల్లాలోని సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో మూడు నెలలు కొనసాగింది. తర్వాత మూడు, నాలుగేళ్ల రేణిగుంటలో నిర్వహించారు. 2020–21 వరకు గుండ్లపల్లెలోను, 21–22 విద్యా సంవత్సరం నుంచి హుస్నాబాద్ ప్రభుత్వ కాలేజీలోను నిర్వహిస్తున్నారు.

**ఎనిమిదేళ్లుగా ఎదురు చూపులు**

ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు నిర్వహించే ఈ పాఠశాల వల్ల ఎంతో మంది స్థానికులకు అవకాశాలు లభిస్తాయని ఆశించారు. మంజూరైన సంవత్సరంలోనే విద్యావకాశాలు కల్పించడానికి స్థానికంగా వసతులు లేకపోవడంతో గర్రెపల్లి, గుండ్లపల్లిలో నిర్వహించగా ప్రస్తుతం హుస్నాబాద్‌లో కొనసాగుతోంది. పాఠశాలలో ప్రవేశాల కోసం వివిధ ప్రాంతాల నుంచి ఎంపికైన విద్యార్థులను చేర్పించేందుకు వచ్చిన తల్లిదండ్రులు పాఠశాల వేరే ప్రాంతంలో ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు.

**బెజ్జంకి విద్యార్థులే ఎక్కువ**

పాఠశాలను ఇతర చోట్ల నిర్వహిస్తున్నా బెజ్జంకి పరిసర మండలాల విద్యార్థులే ఎక్కువ మంది చేరుతున్నారు. విద్యార్థుల ప్రవేశాలు, ఉపాధ్యాయుల నియామకాలు మాత్రం బెజ్జంకి మండలం పేరుతో జరుగుతున్నాయి. అంతే తప్ప భౌతికంగా మాత్రం ఈ పాఠశాల పలు మండలాలకు మారింది. ఈ విద్యా సంవత్సరంలోనైనా పాఠశాలను బెజ్జంకికి తీసుకురావడానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

**తల్లిదండ్రులు ఆందోళన**

వివిధ ప్రాంతాల్లో పాఠశాల నిర్వహించడం వల్ల సర్టిఫికెట్ల విషయంలో భవిష్యత్‌లో ఇబ్బందికరంగా మారుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలను బెజ్జంకి మండలంలోనే కొనసాగించాలని, తాత్కాలికంగా అద్దె భవనంలోనైనా నిర్వహించాలని కోరుతున్నారు. వ్యవసాయ కళాశాల తీసుకువచ్చిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఈ గురుకుల పాఠశాలను కూడా తెస్తారని ఆశిస్తున్నారు.

**బెజ్జంకిలోనే నిర్వహించేలా..**



మండలానికి గతంలో మంజూరైన గురుకుల పాఠశాలను ఇక్కడే నిర్వహించేలా చూస్తాం. ఈ జాప్యం ఎలా జరిగిందో తెలియదు కాని ఇప్పుడు ఇక్కడకు మార్చేందుకు ప్రయత్నిస్తున్నాను. అద్దె భవనంలోనైనా నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నాం. అధికారులు సైతం ప్రభుత్వ పాఠశాల భవనాలను పరిశీలించారు.

– కవ్వంపల్లి సత్యనారాయణ, మానకొండూర్ ఎమ్మెల్యే

**వేరే మండలాల్లో సరికాదు**



బెజ్జంకి మండలానికి మంజూరైన ఎస్సీ గురుకుల పాఠశాలను ఇక్కడనే నిర్వహించాలి. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ఎనిమిదేళ్లుగా ఇతర మండలాల్లో నిర్వహించారు. అది సమంజసం కాదు, అద్దె భవనంలోనైనా నిర్వహించాలి. ఆ తర్వాత పక్కా భవనం నిర్మించాలి.

– బోనగిరి మహేందర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు

**ఇబ్బంది పడుతున్న విద్యార్థులు**



బెజ్జంకికి మంజూరైన పాఠశాలను ఇతర మండలాల్లో నిర్వహించడం వల్ల విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ పాఠశాల హుస్నాబాద్‌లో ఉన్నప్పటికీ ఈ పరిసర మండలాల విద్యార్థులే ఎక్కువగా చేరుతున్నారు. ఈ క్రమంలో పాఠశాల స్థానికంగా ఉంటేనే ఇబ్బంది లేకుండా ఉంటుంది.

– ఎలుక దేవయ్య, పాఠశాల ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్

# ‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటాలి

**ఎంపీ రఘునందన్‌రావు**



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

ములుగు(గజ్వేల్): కార్యకర్తలు కలసికట్టుగా పని చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఎంపీ రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని వంటిమామిడిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల పాలనపై విసుగు చెందిన ప్రజలు బీజేపీ పాలనను కోరుకుంటున్నారన్నారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలోనే బీజేపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని సరికొత్త రికార్డును సృష్టించబోతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకటరమణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమేశ్‌యాదవ్, భాగ్యలక్ష్మి, శ్రీకాంత్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

**పార్టీ బలోపేతానికి కృషి చేయండి**

వర్గల్(గజ్వేల్): బీజేపీ బలోపేతం కోసం శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. మండలంలోని నాచారంలో మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. నాయకులు భూమన్న, రాంరెడ్డి, శ్రీనివాస్, నందన్‌గౌడ్, టేకులపల్లి బాల్‌రెడ్డి, శ్రీరాంశ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మా గోడు వినేవారు లేరా..



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామస్తులు

- అగమ్యగోచరంగా ఐదు గ్రామాలు
- ముంపు గ్రామాల ప్రజల ఆందోళన

గజ్వేల్‌రూరల్: మల్లన్నసాగర్ ప్రాజెక్టు పేరుతో తమ గ్రామాలను ఖాళీ చేయించిన అధికారులు కనీస సౌకర్యాలు కల్పించకుండా చేతులు దులుపుకున్నారని, మూడేళ్లు గడుస్తున్నా తమ గోడు వినేవారు కరువయ్యారని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(వేములఘట్)కి చెందిన ముంపు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేములఘట్, ఏటిగడ్డ కిష్టాపూర్, పల్లెపహాడ్, బ్రాహ్మణ బంజేరుపల్లి, లక్ష్మాపూర్ గ్రామాలను తొగుట మండలం నుంచి తొలగించినట్లు అధికారులు చెప్పారని వాపోయారు. అయితే తమ గ్రామాలను మున్సిపాలిటీ పరిధిలో విలీనం చేశారేమోనని మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించగా ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారని తెలిపారు. తొగుట మండలం నుంచి తొలగించడం, ఇటు మున్సిపాలిటీలోను విలీనం కాకపోవడంతో తమ చిరునామా ప్రశ్నార్థకంగా మారిందని వాపోయారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగాలేదని, తాగునీరు, విద్యుత్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలి పారు. ఇంకా ప్యాకేజీ, పరిహారం పూర్తిస్థాయిలో అందలేదని, తమ సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కనకయ్య, భిక్షపతి, పురుషోత్తంరెడ్డి, మాల్‌పటేల్, జహంగీర్, నర్సింహులు, ఎల్లం, బాలకిషన్, కనకాగౌడ్, చందు, శ్రీను పాల్గొన్నారు.

# అందరి ఆదరణతోనే డిపో అభివృద్ధి



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి**

హుస్నాబాద్: ఆర్టీసీని ప్రయాణికులు ఆదరించి డిపో అభివృద్ధిలో పాలు పంచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి కోరారు. హుస్నాబాద్ నుంచి యాదగిరిగుట్టకు వెళ్లే కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును గురువారం ఆయన బస్టాండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కొత్త బస్సు ప్రతిరోజు యాదగిరి గుట్టకు రెండు ట్రిప్పులు, వేములవాడకు ఒక ట్రిప్పు నడుస్తుందన్నారు. హుస్నాబాద్ నుంచి రోడ్డు సౌకర్యం ఉన్న ప్రతి గ్రామానికీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో బాసర, ఇతర పుణ్య క్షేత్రాలకు మరికొన్ని సర్వీస్‌లను నడిపించేందుకు మంత్రి పొన్నం ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఆర్టీసీ కల్పించే అవకాశాలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డిపో మేనేజర్ వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. పట్టణంలోని పలు ప్రాంతాలలో వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 14 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా గురువారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.23,500 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

### డ్రంకెన్ డ్రైవ్ కేసులో మూడు రోజులు జైలు

గజ్వేల్‌రూరల్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన ఓ వ్యక్తికి మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో ఆరుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వారిని విచారించిన న్యాయమూర్తి స్వాతిగౌడ్ గురువారం ఆరుగురికి రూ.7 వేల జరిమానా, అందులో ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ కుషాల్‌నగర్ ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుషాల్‌నగర్, కొత్త బస్టాండ్, హరిప్రియనగర్, తహశీల్దార్ కార్యాలయ ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం

**బీజేపీ నాయకులు**



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

గజ్వేల్‌రూరల్: రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి ఏగొండ ఆరోపించారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించినప్పటికీ గజ్వేల్ మార్కెట్ పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. మార్కెట్‌యార్డులో ఉన్న నాలుగు జల్లి మిషన్లలో రెండు చెడిపోగా, మరో రెండు మరమ్మతులకు గురయ్యాయని చెప్పారు. రైతులు జల్లి పట్టడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. గన్నీ బస్తాల పంపిణీ తదితర సమస్యలతో అన్నదాతలు సతమతమవుతున్నారని మండిపడ్డారు. క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించడంతోపాటు తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని, తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలుచేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివకుమార్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సందీప్, నర్సింహ, విజయ్, అరవింద్, నాగు ముగిరాజ్, రాణి, భక్తమాల, స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### మూడేళ్లుగా సా...గుతూనే..



మెట్టుబండలు వద్ద నిలిచిన రోడ్డు విస్తరణ పనులు

సిద్దిపేట నుంచి చిన్నకోడూరు వరకు కొనసాగుతున్న 8కిలో మీటర్ల నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి మూడేళ్లు కావస్తున్నా పూర్తి కాకపోవడంతో వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు, పాలకులకు ఎన్నిమార్లు మొర పెట్టుకున్నా ఫలితం ఉండదటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట):

# స్వర్ణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈఓ, డైరెక్టర్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని పద్మావతి సమేత వేంకటేశ్వర దేవస్థానం స్వర్ణోత్సవాలు 17 నుంచి 23 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ విశ్వనాథశర్మ, చైర్మన్ టీవీ అమరేశ్ విష్ణు తెలిపారు. మోహిన్‌పుర వేంకటేశ్వర ఆలయ ఆవరణలో స్వర్ణోత్సవ కరపత్రాన్ని గురువారం వారు ఆలయ డైరెక్టర్లు దాస శ్రీనివాస్, పన్యాల మనోహర్ రెడ్డి, పూజల బాలకృష్ణ, బుక్క గోపి, మక్క బాబు, బైరి నాగమణి, శ్రీనివాస్, నవీన్, సంతోష, బాలరాజు, ఉమా వేంకటేశ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 17 నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు వంటేరు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, మల్క కొమురయ్య, అంజిరెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో అర్చకులు శేష పణింద్రాచార్యులు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

# కళాశాల, హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

**ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్**



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నేత రజనీకాంత్

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్ డిమాండ్ చేశారు. మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నూతన మండలం ఏర్పడి తొమ్మిదేళ్లు గడుస్తున్నా మండలంలో జూనియర్ కళాశాల, వసతి గృహాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. అన్ని వసతులు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రంజిత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు భరత్‌కుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు విక్రమ్, లెనిన్ రాజు, సంతు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ పొదుపు సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపిక**

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కట్కూర్ ఆంజనేయ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా కొలుగూరి మధుకర్‌రెడ్డి గురువారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా సురంపెల్లి మహేందర్‌తోపాటు పాలకవర్గాన్ని నియమించారు. మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ 2005లో 155 మంది సభ్యులతో మొదలై ప్రస్తుతం 655 మంది సభ్యులతో దాదాపు రూ.కోటి ఆదాయంతో ఇతర పొదుపు సంఘాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు.

**◆ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ**

బెజ్జంకి(సిద్దిపేట): హనుమాన్ జయంతి సందర్భంగా కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో 22న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు అజయ్‌వర్మ పిలుపునిచ్చారు. బెజ్జంకిలో గురువారం శోభాయాత్రకు చెందిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. రాజు, మల్లేశం, రామచంద్రం, రవి, సునీత, సాయిలు, శ్రీనివాస్, వెంకటేశం పాల్గొన్నారు.

**◆ కేసీఆర్ కృషి ఫలితమే కాళేశ్వరం**

చిన్నకోడూరు(సిద్దిపేట): కేసీఆర్, హరీశ్‌రావుల కృషి ఫలితమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణమని బీఆర్ఎస్ జిల్లా నాయకులు జంగిటి శ్రీనివాస్, పానుగంటి రమేశ్ అన్నారు. చిన్నకోడూరులో గురువారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని, ఫలితంగా నేడు రైతులకు సాగునీరు అందుతుందన్నారు. అలాంటి కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించడం విడ్డూరంగా ఉందన్నారు.

**◆ రామకోటి సేవలు అభినందనీయం**

గజ్వేల్‌రూరల్: రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని మండలం దిలాల్‌పూర్ గ్రామస్తులు అన్నారు. భద్రాచలం నుంచి వచ్చిన ముత్యాల తలంబ్రాల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామంలో గురువారం చేపట్టారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులు మాట్లాడారు. ఆలయ కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, రాజేశంగుప్తా, రఘుపతిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

**◆ పేదల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ**

దౌల్తాబాద్(దుబ్బాక): కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదల పక్షానే నిలుస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని హైమద్ గ్రామంలోని ఎంబీఆర్ ఫంక్షన్ హాల్‌లో రూ.6,95,500 విలువైన చెక్కులను, అలాగే రాయపోల్ మండలానికి సంబంధించి రూ.4.75 లక్షల చెక్కులను పంపిణీ చేశారు.

**తొగుటలో..**

తొగుట(దుబ్బాక): ప్రభుత్వ అతిథి గృహంలో 13 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. స్వామి, రాంరెడ్డి, విజయ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, పోచయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.